ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 1 సెప్టెంబరు 2025 | 3

నారికేళేశ్వరుడిగా జైగణేష్‌స్వామి



పిఠాపురంలో జైగణేష్ స్వామికి కొబ్బరికాయలతో అలంకారం

పెరుగుతున్న గోదావరి

- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక 5
- 11,35,249 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

నర్సింగ్ పరీక్ష రద్దు 5



తునిలో పోలీసుల పర్యవేక్షణలో జరుగుతున్న వినాయక నిమజ్జనం

పూజలు.. నిమజ్జనాలు

గణపతి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం కొన్ని గణేష్ మండపాల్లో ఓ పక్క పూజలు జరుగుతుండగా మరోపక్క కొన్నిచోట్ల ఊరేగింపులు, నిమజ్జనాలు కూడా జరిగాయి. మరో ఐదారురోజుల్లో గ్రహణం ఉండడంతో కొందరు ముందుగానే వినాయక విగ్రహాలను ముందే నిమజ్జనం చేసేస్తున్నారు. ఎక్కడికక్కడ పోలీసులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. 6



గొల్లప్రోలు మండలం చేబ్రోలు రథంబాటలో చేతిలో విల్లుతో గణనాథుడు

సమస్యలు, అభివృద్ధిపై..
రియల్‌టైమ్ పర్యవేక్షణ

- జనసేన కేంద్ర కార్యాలయంతో నాయకులు, కార్యకర్తలు అనుసంధానం
- తొలిఏడాదిలో నియోజకవర్గంలో రూ.400కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో కూటమి స్ఫూర్తి ప్రతిబింబించాలి
- మంగళగిరిలో పిఠాపురం నియోజకవర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలోని సమస్యలు, అభివృద్ధి పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా రియల్‌టైమ్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నట్లు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రకటించారు. నియోజకవర్గంలోని 52 గ్రామాలు, రెండు పట్టణాల పరిధిలో ప్రతి గ్రామంలో ఐదుగురు పార్టీ సభ్యులతో కేంద్ర కార్యాలయం అనుసంధానమవుతుందని తెలిపారు. వీరి ద్వారా తమ గ్రామాలు, పట్టణాల్లో ఎటువంటి అభివృద్ధి కోరుకుంటున్నారు, ఉన్న సమస్యలు ఏంటి, పార్టీ కార్యక్రమాలు ఎలా సాగుతున్నాయో ఎప్పటికప్పుడు తెలుసుకుంటానని చెప్పారు. ఆ ఐదుగురు సభ్యులు ఎవరు అనేది ఆయా గ్రామాల జనసేన క్రియాశీలక సభ్యులు, నాయకులే నిర్ణయించుకుని కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలని ఆయన సూచించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో ఆయన ఆదివారం రాత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారిప్రాంత సమస్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. ఏడాదికాలంలో నియోజకవర్గంలో రూ.400కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పవన్ తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పని గురించి వివరించేటప్పుడు ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు గురించి చెప్పాలని, కూటమిగా ఐక్యత చూపాలని, ఇందులో కోపతాపాలు, వ్యాఖ్యలకు తావులేదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో కూటమి స్ఫూర్తి ప్రతిబింబించాలని తెలిపారు.

ప్రతినెలా సమీక్షలు

ఇకనుంచి ప్రతినెలా రెండుసార్లు పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధిపై తాను సమీక్షించనున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ ప్రకటించారు. జనవాణిలో ఉప్పాడ తీరప్రాంతంలో సముద్రపు కోత గురించి తన దృష్టికి తీసుకువచ్చారని, ఆ సమస్యను కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రక్షణగోడ నిర్మాణానికి ముందుకు వెళ్తున్నామంటే అందుకు కేంద్రసహకారమే కారణమని తెలిపారు. ఉప్పాడనుంచి కాకినాడ వరకూ బీచ్ రోడ్డు అభివృద్ధి చేసి వాణిజ్య కార్యక్రమాలు చేపట్టాలని సీఎం చంద్రబాబును కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు మరచిపోలేదని, వారు కోరుకున్న మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాననని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తానన్నారు. ఎన్నికల సమయంలో కొబ్బరిబొండాలు అమ్మేవ్యక్తితో జరిగిన సంభాషణను గుర్తుచేసుకుని అతనిపేరు జుత్తుక తాతబ్బాయి,నాగులాపల్లిఅని అతను కోరినట్టుగా ఇల్లు నిర్మిస్తామన్నారు.



పిఠాపురం నియోజకవర్గ నాయకులు, జనసైనికులు, వీరమహిళల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఐదుగురుతో కమిటీ

పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడంపై ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటుచేసి రెండువారాల్లో నివేదిక ఇవ్వాలని పవన్ సూచించారు. నియోజకవర్గంలోని అందరు నాయకులు, క్రియాశీలక సభ్యులతో చర్చించి నివేదిక ఇచ్చే బాధ్యతలను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ప్రభుత్వ విప్ హరిప్రసాద్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులకు అప్పగించారు. సమావేశంలో వీరితో పాటు రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ నాగబాబు, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.





పర్సులోకి.. రేషన్ కార్డ్



జిల్లాకు స్మార్ట్ కార్డులు

- జిల్లాకు 6,36,238 కార్డులు
- రేషన్ డీలర్లకు అందజేత
- నేటి నుంచి ఇంటి వద్ద అందజేత
- ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు
- ఆరు నెలలు తీసుకోకపోతే కార్డు కట్

సామర్లకోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అధికారిక ముద్రతో కొత్తగా స్మార్ట్ కార్డులను ఇస్తామని ప్రకటించింది. అన్న మాట ప్రకారం సోమవారం నుంచి ఆ కార్డుల పంపిణీని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.ఈ మేరకు అన్ని మండలాల్లో రేషన్ డీలర్లకు శని, ఆదివారాల్లో తహశీల్దార్లు సరఫరా చేశారు. ఏటీఎం కార్డు సైజ్‌లో ఆధునిక సాంకేతికతతో రూపుదిద్దుకున్న ఈ కార్డుల్లో బయోమెట్రిక్ డేటా, క్యూఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి.లబ్ధిదారులు ఎక్కడి నుంచైనా సులభంగా రేషన్ తీసుకునే అవకాశం ఉంది. దీంతో ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇప్పటి వరకూ వరుసగా ఆర్నెల్ల పాటు రేషన్ తీసుకోని వారికి కొత్త కార్డులు ఇవ్వరు. తమకు కార్డులు రాలేదని అధికారులకు తెలిపితే పరిశీలించి కార్డులు మంజూరు చేస్తారు.

6,36,238 స్మార్ట్ రేషన్‌కార్డులు

కాకినాడ జిల్లాకు 6,36,238 స్మార్ట్ రేషన్ కార్డులు రాగా వాటిని తహశీల్దార్ కార్యాలయాలకు పంపారు. సచివాలయానికి చెందిన ఓ ఉద్యోగి సంబంధిత ప్రాంతంలోని డీలర్ ద్వారా లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందజేస్తారు.ప్రతీ కార్డుదారుడి ఇంటికీ వెళ్లి కార్డులను అందజేస్తారు. సెప్టెంబరు 1 నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కానుండడంతో కొత్త స్మార్ట్ కార్డులపై ఈ-పాస్ మిషన్ ద్వారా కార్డుదారు వేలిముద్ర తీసుకుని ఆన్‌లైన్ పద్ధతిలో స్మార్ట్ కార్డులు ఇస్తారు. కాగా గత మే నెల 7 నుంచి కొత్త రేషన్‌కార్డులకు, కార్డుల్లో మార్పులు, చేర్పులు, సవరణలకు దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఆ తర్వాత అధికారుల పరిశీలన, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 25న స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తామని ప్రకటించిన తర్వాత కూడా దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు అందజేస్తారు. చేర్పులు, మార్పులు ప్రక్రియ చేపడతారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతోంది.

ఏ మండలానికెన్ని..

మండలం	స్మార్ట్ కార్డులు
1) సామర్లకోట	43,291
2) పిఠాపురం	39,589
3) గొల్లప్రోలు	24,869
4) యు.కొత్తపల్లి	27,358
5) కరప	25,552
6) కాజులూరు	22,233
7) కాకినాడ రూరల్	49,854
8) కాకినాడ అర్బన్	78,212
9) తాళ్లరేవు	17,458
10) పెదపూడి	23,017
11) పెద్దాపురం	39,091
12) జగ్గంపేట	26,572
13) ఏలేశ్వరం	23,587
14) గండేపల్లి	18,119
15) శంఖవరం	17,458
16) ప్రత్తిపాడు	25,841
17) రౌతులపూడి	16,942
18) కోటనందూరు	15,594
19) కిర్లంపూడి	23,599
20) తొండంగి	28,374
21) తుని	40,036

జిల్లాలో కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్ మండలాల తర్వాత మూడోస్థానంలో అత్యధిక స్మార్ట్‌కార్డులు ఉన్న మండలంగా సామర్లకోట మండలం ప్రాధాన్యం సంతరించుకుంది.

నేటి నుంచి ఇంటి వద్ద స్మార్ట్ కార్డులు పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ముద్రించిన స్మార్ట్ రేషన్ కార్డులను జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాం. జేబులో పట్టే సైజ్‌లో కార్డులు వచ్చాయి. ఇక ఏ ఇబ్బందీ లేకుండా రేషన్‌కార్డును ఎక్కడికైనా ఈజీగా తీసుకెళ్లవచ్చు. అచ్చంగా ఏటీఎం కార్డులాగానే ఉంది.. గతంలో రేషన్ కార్డు అంటే పెద్ద సైజ్‌లో ఉండేది.. ఎక్కడికైనా తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు అటువంటిదేం లేదు. పర్సులో కానీ.. జేబులో కానీ పెట్టుకుని తీసుకెళ్లిపోవచ్చు. రేషన్ డీలరు, సచివాలయాల సిబ్బంది సోమవారం నుంచి ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులకు ఈ కార్డులను పంపిణీ చేస్తారు.

- సత్యనారాయణరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి, కాకినాడ జిల్లా

సైకిల్ తొక్కుదాం.. ఫిట్‌గా ఉందాం!

సర్పవరం జంక్షన్, కాకినాడ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శారీరక ధృడత్వం, వ్యక్తిగత ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుందని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సర్పవరం జంక్షన్ వరకు సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు.మారిన ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లతో శరీరానికి తగిన వ్యాయామం ఉండడం లేదన్నారు. సైక్లింగ్‌ను ఆరోగ్యకరమైన అలవాటుగా చేసుకోవాలన్నారు.పోలీసులు తప్పనిసరిగా సైక్లింగ్, వ్యామామం చేయాలన్నారు. ప్రతి ఆదివారం ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ర్యాలీలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఏఎస్పీ (ఏఆర్) శ్రీనివాస్,ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ.సత్యనారాయణ, డీఎస్పీ ఏఆర్ శ్రీహరి, సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు,వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, పోర్టు సీఐలు ఎం.నాగదుర్గారావు,ఎం.అప్పలనాయుడు, కేవీవీ సత్యనారాయణ, పి.సునీల్‌కుమార్, ట్రాఫిక్ సీఐలు రామారావు, రమేష్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.





ఫీవర్..వైరల్!

జిల్లా అంతటా..జ్వరాలు

వర్షాలు పడుతున్నాయ్.. ఎండలూ కాస్తున్నాయి. విభిన్నవాతావరణం.. ఎవరికీ అంతుచిక్కని పరిస్థితి. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి(జీజీహెచ్), ప్రైవేటు ఆసుపత్రులు ఎక్కడ చూసినా.. జ్వర పీడితులే. మలేరియా, టైఫాయిడ్, డెంగీలతో పోరాడుతున్నారు. వర్షాకాలం.. దోమలు విజృంభిస్తుండడం, పల్లెల్లో పారిశుధ్యం క్షీణించడంతో ప్రజలు జ్వరాలతో వణికిపోతున్నారు..

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

జిల్లాల్లో సీజనల్ వ్యాధులు ప్రజలకు నరకం చూపుతున్నాయి. ఏదో ఒక అనారోగ్య సమస్యతో ఆసుపత్రులకు వెళ్లే వారు అధికమయ్యారు. జిల్లాలోని 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 62 ఆరోగ్య సచివాలయాలు, 40 సామూహిక, 23 పట్టణ ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా జ్వరాలతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఉంటున్నారు. సీజనల్ వ్యాధులు ప్రజలను పట్టిపీడిస్తున్నా.. వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న చర్యలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తే కొంత మేరకు జ్వర బాధితులను కట్టడి చేయొచ్చు. ఆ దిశగా ఆ శాఖ అధికారులు అడుగులు వేయాలి.

- రోజురోజుకు పెరుగుతున్న బాధితులు
- ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రుల వద్ద బారులు
- దోమల నివారణ చర్యలు నామమాత్రం

ఆసుపత్రులకు జ్వరపీడితుల క్యూ

ఉభయగోదావరి జిల్లాలతో పాటు, ఏజెన్సీ ప్రాంతానికి ఆరోగ్యప్రదాయినీగా ఉన్న కాకినాడ జీజీహెచ్‌కు నిత్యం కొన్ని వేల మంది వైద్య సేవలకు వస్తుంటారు. వీరిలో జ్వర బాధితులే అధికం. ప్రస్తుతం జీజీహెచ్ రోగులతో కిటకిటలాడుతోంది. నిత్యం ఓపీలో 500 మందికిపైగా జ్వరపీడితులే ఉంటున్నారు.డెంగీ బారిన పడిన వారికి ప్రత్యేక వైద్యసేవలందిస్తున్నారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలకు సాధారణంగా రోజుకు 50 మందికి పైగా జనం వివిధ ఆరోగ్యసమస్యలతో వస్తుంటారు. దగ్గు, జలుబు, కాళ్లు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులు, ముఖ్యంగా జ్వరం ఇలా పలు లక్షణాలున్న వారు వైద్యానికి వస్తుంటారు. గత పది రోజులుగా ఇలాంటి ఆరోగ్య సమస్యలతో వచ్చే బాధితులు పెరుగుతూ వస్తున్నారు.వీరికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. అవసరమైన వారిని కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు.

దోమలతోనే..

వర్షాకాలం కావడంతో దోమలు ప్రతాపాన్ని చూపుతున్నాయి. మనుషుల రక్తాన్ని పీల్చేస్తున్నాయి.పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంతో జ్వర బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. కాకినాడ నగరపాలక సంస్థ,పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, తుని మునిసిపాలిటీల పరిధిలో దోమల నియంత్రణ చర్యలను అధికారులు పెద్దగా చేపట్టకపోవడంతో దోమలు ప్రాణాలు తోడేస్తున్నాయి.దోమల ధాటికి ప్రజలు రోగాలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులకు పట్టడం లేదు.పల్లెల్లో పరిస్థితి దారుణంగా ఉంది.

ప్రైవేటు .. దోపిడీ



తీవ్ర జ్వర లక్షణాలతో ఉన్న వారు అప్పులు చేసి మరీ ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా కొన్ని ఆసుపత్రుల వైద్యులు రకరకాల వైద్య పరీక్షలకు సిఫారసు చేస్తున్నారు. వేలాది రూపాయలు పిండేస్తున్నారు. డెంగీ, మలేరియా వచ్చి ప్లేట్‌లెట్స్ పడిపోతే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు లాగేస్తున్నారు. ఒక్కో చోట భయపెట్టి మరీ డబ్బులు లాగుతున్నారు.

నిదానంగా పెరుగుతున్న గోదావరి

» కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
» 11,35,249 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల


ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నిదానంగా పెరుగుతూ ప్రవహిస్తోంది. శనివారం రాత్రి 9గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 11.75 అడుగులకు చేరుకుంది. ఆపై కొన్ని గంటల పాటు నిలకడగా ఉండి 2,3 గంటలకు ఒక పాయింట్ చొప్పున పెరుగుతూ ఆదివారం మధ్యాహ్నం 4గంటలకు 12.80 అడుగులకు చేరుకుంది. రాత్రి 7గంటలకు అదే రీడి ంగ్ వద్ద నిలకడగా కొనసాగింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 11,35,249 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4700 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2300 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5500 క్యూసెక్కులు చొప్పు న సాగునీటిని విడుదల చేస్తున్నారు.

ఎగువున భద్రాచలం వద్ద ఆదివారం ఉదయం 8గంటలకు నీటి మట్టం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై ఒక పాయింట్ మాత్రమే పెరిగి 48.10 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. ఎగువున కాళేశ్వరం, పేరూరు వద్ద నీటి మట్టం తగ్గుతుండగా దిగువన దుమ్ముగూడెం, భద్రాచలం, కూనవరం, కుంట, పోలవరం వద్ద నిలకడగా ఉంది.

నిలకడగా శబరి

చింతూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శబరి, గోదావరి నదులు నిలకడగా ఉన్నాయి. ఆదివారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి 47.90 అడుగులు ఉండగా, చింతూరు వద్ద శబరి నది 32 అడుగుల మేర ప్రవహిస్తోంది. శబరి తగ్గకపోవడంతో దాదాపు పది రోజులుగా లోతట్టు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సకాలంలో వైద్యం అందక మహిళ మృతి


సుబ్బమ్మను ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబీకులు, ఆసుపత్రిలో మృతిచెందడంతో మృతదేహాన్ని నాటు పడవపై తరలిస్తున్న దృశ్యం



నాటు పడవపై మృతదేహం తరలింపు

చింతూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వరద కారణంగా రహదారులు మూసుకుపోయాయి. దీంతో లోతట్టువాసులు సకాలంలో ఆసుపత్రులకు చేరలేని పరిస్థితి విలీన మండలాల్లో ఉంది. దీంతో కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వరరామచంద్రపురం మండలం కుంజవారిగూడెనికి చెందిన బొడ్డు సుబ్బమ్మ (65) రక్త హీనత కారణంగా బాగా నీరసించింది. శనివారం ఆమె కుటుంబీకులు సోకిలేరు వాగు మీదుగా నాటు పడవ దాటించి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందింది. దీంతో కుటుంబీకులు ఆసుపత్రి నుంచి సోకిలేరు వాగు వద్దకు ఆటోపై మృతదేహాన్ని తరలించి అక్కడి నుంచి నాటు పడవపై వాగు దాటించి మరో ఆటోపై కుంజవారిగూడెం తరలించారు.

ఇందుపల్లిలో వేద సభ


ఇందుపల్లిలో జరిగిన వేద సభలో పాల్గొన్న వేదపండితులు

అమలాపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సమస్త జీవకోటి సుభిక్షంగా జీవించేందుకు, మానవాళి జీవన విధానానికి వేదమే ప్రామాణికమని గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠి పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ రాణి హయగ్రీవ అవధాని వేదశాస్త్ర పరిషత్ 14వ వార్షిక వేద సభ ఆదివారం కోనసీమ జిల్లా ఇందుపల్లి అరవ గరువులో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో శ్రీబాలభక్తగణపతి మందిరంలో నిర్వహించిన వేద సభకు తొలుత టీకే విశ్వనాథ్ వేదపండితులకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన వేద సభలో దువ్వూరి సూర్యప్రకాశ సోమయాజులు మాట్లాడుతూ మానవులు సమస్త జీవకోటి కోసం ఆచరించాల్సిన ఆచారాలు, కర్మకాండల గురించి వేదాల్లో వివరించిన విధానాన్ని తెలియజేశారు. సమస్త విద్యల స్వరూపంగా వేదాలు భాసిస్తున్నాయని పేర్కొన్నారు. వడ్లమాని సుబ్రహ్మణ్య ఘనాపాఠి మాట్లాడుతూ ఎక్కడ వేదపఠనం జరుగుతుందో అక్కడ జీవరాశులు ఏవిధంగా సుభిక్షంగా ఉంటాయో వివరించారు. వేదికపై తంగిరాల సుబ్రహ్మణ్య సోమయాజులు పాల్గొని వేదాలు, ఉపనిషత్తుల సారాంశం తెలియచేశారు. తత్వ స్వరూపమై ఉన్న పరమాత్మన్ని తెలుసుకునేందుకు ఉపనిషత్తులు ఏవిధంగా దోహదపడతాయో విశదీకరిం చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు, ఘనాపాఠిలు, క్రమపాఠిలు వేదస్వస్తి నిర్వహించారు. కార్యక్రమంలో శిష్ఠా భవానీశంకర్, వేదశాస్త్ర పరిషత్ అధ్యక్షుడు కర్రా సోమసుందరశాస్త్రి, కార్యదర్శి ముష్టి వేంకటరాజేశ్వరశర్మ, కోశాధికారి అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితులు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం వేదశాస్త్ర పరిషత్ తరపున ఘనాపాఠీలు, పండితులను సత్కరించారు.

గణపతి ఆలయం.. భక్తజన సంద్రం!

బిక్కవోలులో ప్రత్యేక పూజలు



బిక్కవోలులో శ్రీలక్ష్మీగణపతి దర్శనానికి బారులు తీరి స్వామివారి చెవిలో కోర్కెలు చెప్తున్న భక్తులు

బిక్కవోలు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఐదో రోజైన ఆదివారం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులోని ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు శ్రీలక్ష్మీగణపతికి మూల మంత్ర పూజలు, మంత్రజపతర్పణ, హోవనములు, సావిత్రి పంటకోట ఉపషనిత్తు పారాయణాలు జరిపారు. హైకోర్టు ప్లీడర్లు స్వామి దర్శనానికి రావడంతో ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబా రెడ్డి వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయ అర్చకులతో ఆశీర్వచనాలు అందజేశారు. స్వామిని దర్శించుకున్నవారిలో హైకోర్టు జీపీ నాగరాజు నాగురు, పీపీలు మెండా లక్ష్మీనారాయణ, కైలార్ కృష్ణ, ఏపీ జెన్‌కో జీపీ భూషణచౌదరి, కమర్షియల్ టాక్స్ జీపీ బొబ్బా స్వామికిరణ్, ఇరిగేషన్ జీపీ శ్యామ్‌సుందరరావు వున్నారు. ఉచిత బస్సు పథకం కారణంగా మహిళలు బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలకు పోటెత్తారు.

అయినవిల్లిలో ప్రత్యేక అలంకరణ



అయినవిల్లిలో స్వామికి పంచ హారతులు, ఆలయం వద్ద భక్తులు

అయినవిల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తారు. స్వామికి అభిషేకాలు, లక్ష దూర్వార్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మూషిక వాహనంపై స్వామికి మాఢవీధి సేవ అనంతరం పంచ హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు క్యూలైన్లలో వేచి ఉండడంతో దేవస్థానం బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసింది.

రాష్ట్ర సర్వే అకాడమీ రీజనల్ జేడీగా కుమార్


కుమార్

సామర్లకోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్వే అకాడమీ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా సీహెచ్‌వీఎస్ఎన్. కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ జిల్లా సామర్లకోటలో ఉన్న రాష్ట్ర సర్వే ట్రైనింగ్ అకాడమీ జేడీ, వైస్ ప్రిన్సిపాల్‌గా గత ఐదేళ్లుగా కుమార్ పనిచేస్తుండగా రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. తాజాగా పదోన్నతి పొందిన ఆర్‌జేడీ మల్టీజోన్ పరిధిలో శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకూ 13 జిల్లాలు సామర్లకోట పరిధిలోకి వస్తాయి. గతంలో కుమార్ అమరావతిలోని రాజధానిలో 33 వేల ఎకరాల భూమికి రికార్డుస్థాయిలో సర్వే నిర్వహించారు. అందుకుగాను అప్పటి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా చీఫ్ మినిస్టర్ స్టేట్ అవార్డు అందు కున్నారు. సర్వే ట్రైనింగ్ అకాడమీ ప్రిన్సిపాల్‌గా గత ఐదేళ్లుగా 25 వేలమందికి పైగా సర్వే, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ సిబ్బందికి రోవర్, సీవోఆర్ఎస్, క్యూజిస్, డ్రోన్‌సర్వే తదితర అంశాలపై 137 రకాల అధునాతన సర్వే శిక్షణ అందించారు. ఏపీ రీసర్వే ప్రాజెక్ట్‌లో 32 వేల చదరపు కిలో మీటర్లు హెలీకాప్టర్ పై, డ్రోన్ పై చేయించారు.

నర్సింగ్ పరీక్ష రద్దు

జీజీహెచ్(కాకినాడ) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గత నెల 29న జరిగిన ఫౌండేషన్ ఆఫ్ నర్సింగ్ మొదటి సంవత్సర జీఎన్ఎం పరీక్షను రద్దు చేస్తున్నట్టు చీఫ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రద్దు చేసిన పరీక్షకు బదులుగా ఈ నెల 2న మంగళవారం అదే పరీక్షను కాకినాడ ఆర్ఎంసీలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు మంగళవారం యూనిఫామ్ అలాగే హాల్‌టికెట్‌తో సహ ఆర్ఎంసీకి ఉదయం 9 గంటలకు హాజరుకావాలని డాక్టర్ లావణ్యకుమారి స్పష్టం చేశారు.

సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో రాకపోకలు బంద్

అంతర్వేది, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో ఆదివారం పెరిగిన వరద కారణంగా రాకపోకలు బంద్ అయ్యాయి. పంట్లను పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం వైపు నిలిపివేశారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వశిష్ట గోదావరిలోకి 6లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో నర్సాపురం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. లంక ప్రాంతాలకు వరద నీరు చేరడంతో స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా చించినాడ బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో రాకపోకలకు అంతరాయం లేకపోయినప్పటికీ సఖినేటిపల్లి రేవు మీదుగా నర్సాపురం చేరుకునేవారు అత్యధికంగా ప్రయాణికులు ఉంటారు. అయితే వరద ఉధృతి పెరగడంతో సఖినేటిపల్లి రేవులో రాకపోకలు రెండు రోజుల పాటు నిలిపివేశారు.

దేవాలయ భూముల్లో వ్యవసాయ పనులు

చెట్లను తొలగించిన రైతులపై కేసు

కొత్తపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స గ్రా మానికి చెందిన శ్రీసీతారామస్వామి దేవాలయ భూముల్లో వ్యవసాయ పనులు చేపట్ట రాదని కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ పనులు చేపట్టడమే కాకుండా గట్లపై ఉన్న చెట్లను అక్రమంగా తొలగించిన రైతులపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కొమరగిరిలో సర్వే నెం.121, 122లో గోర్స దేవాలయానికి సుమారు 20 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని చాలాకాలంగా తామే సాగు చేస్తున్నామని ఆక్రమణదారులు, ఆ భూమి దేవుడిదేనని దేవాలయశాఖ మధ్య వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. కొన్నిరోజులు మౌనంగా ఉన్న రైతులు ఆదివారం దేవాలయానికి చెందిన భూముల్లో వ్యసాయపనులు చేపట్టారు. అంతటితో ఆగకుండా గట్లపై ఉన్న చెట్లను నరికించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ రొంగల వీరబాబు తహశీల్దార్ జి.చిన్నారావుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీఆర్వో కిషోర్ చెట్లను నరికిన, వ్యవసాయ పనులు చేపట్టిన వారిపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ సంఘ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య

కాకినాడ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కాకినాడ బార్ అసోసియేషన్‌లో ఆదివారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి చంటి, రాష్ట్ర నాయకులు ముప్పాళ్ళ సుబ్బారావు, నరహరిశెట్టి రవి కృష్ణ హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అంగులూరి సుబ్బయ్య మాట్లాడుతూ గుమస్తాల జీవన స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని, ప్రభుత్వం తీసుకొచ్చిన 13/92 ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ ఫండ్‌ను అమలుచేయడంలో ఉన్న లోపాలను తక్షణం సరిదిద్దాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మరణానంతరం కుటుంబసభ్యులకు అందే ఆర్థిక సహా యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల భాస్కర్‌రావు మాట్లాడుతూ గుమస్తాల పిల్లల విద్య, కుటుంబ భద్రత కోసం ప్రత్యేక నిధి అవసరమన్నారు. గుమస్తాల సంక్షేమ నిధిని బలపర్చడం కోసం అందరు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాకినాడ బార్ అసోసియేషన్ నాయకులు గాదం సత్య ప్రభాకర్‌రావు, రాంబాబు, జీఎస్ఆర్ కృష్ణ, గోపి, సురేష్, సుధాకర్, నిరీక్షణరావు, నగేష్, సిరియల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు


శ్రీలక్ష్మీనరసింహస్వామివారు

అంతర్వేది, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో సోమవారం నుంచి గురువారం వరకు స్వామివారి పవిత్రోత్సవ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం నుంచి అంకురార్పణ, ఆదివాసములు మొదలగు పూజాకార్యక్రమాలతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మంగళ, బుధవారాల్లో అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమాలు, పవిత్రాఅవరోహణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గురువారం అలంకార తిరుమ ంజనం, మహాశాంతి హోమం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం, రాత్రి పవిత్ర అవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్ర పుష్పములు, పవిత్రముల వినియోగం జరుగుతాయని తెలిపారు. ఆలయమంతా పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణతో తీర్చిదిద్ది మహాశాంతి హోమానికి తాత్కాలిక యాగశాల ఏర్పాటు చేశామన్నారు. దేశ, రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని, స్వామివారికి దివ్యతేజో ప్రకాశములు కలగాలని, సర్వప్రాయశ్చిత్యార్థం పవిత్రోత్సవాలు నిర్వహించబడతాయని ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు.

7న మధ్యాహ్నం నుంచి దర్శనాలు నిలుపుదల

భాద్రపద పౌర్ణమి ఆదివారం రాత్రి 9.50 గంటలకు ప్రారంభమై రాత్రి 12.24 గంటలకు పూర్తి అయ్యే సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించు సందర్భంగా అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 7న ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి భక్తులకు దర్శనాలు నిలిపివేస్తారని ఏసీ ప్రసాద్ తెలిపారు. పునఃదర్శనాలు 8వ తేదీ సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటల నుంచి ఉంటాయని, ఆర్జిత అభిషేకం రద్దు చేయబడిందని పేర్కొన్నారు.

కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రానికి స్కోచ్ అవార్డు



కొవ్వూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ అరటి రకాలను ఉత్పత్తి చేయడంలో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో కొవ్వూరు ఉద్యాన (అరటి) పరిశోధనా కేంద్రం స్కోచ్ అవార్డుకు ఎంపికైంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని వేములూరు రోడ్‌లో ఉన్న డా.వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధనా కేంద్రంలో సంప్రదాయ అరటి రకాల్లో నాణ్యమైన టిష్యూకల్చర్ మొక్కల ఉత్పత్తి చేయడంపై అవార్డుకు ఎంపికైనట్టు పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.డి.వెంకటస్వామి తెలిపా రు. ఇప్పటివరకు పరిశోధనా స్థానం నుంచి సుమారు 20 లక్షల టిష్యూకల్చర్ మొక్కలను ఉత్పత్తి చేయడం, మొట్టమొదటగా అరటిలో మగ పువ్వుల ద్వారా సంప్రదాయ అరటి రకాలైన తెల్ల చక్కెరకేళి, కర్పూర చక్కెరకేళి, అమృతపాణి, ఎర్ర చక్కెరకేళి, కర్పూరవల్లీ మొక్కలను అత్యధిక స్థాయిలో ఉత్పత్తి చేసి రైతుల అందించామన్నారు. ఈ అవార్డుకు సంబంధించి ఉద్యాన విభాగం సీనియర్ శాస్త్రవేత్త డా.కె.రవీంద్రకుమార్ 2025 ఏప్రిల్ నుంచి జూన్ వరకు వివిధ స్థాయిల్లో పాల్గొనడం జరిగిందన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సీటీకి 4 అవార్డులు వచ్చాయని, వాటిలో కొవ్వూరు పరిశోధన కేంద్రానికి స్కోచ్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

విద్యార్థినికి అధ్యాపకుడు అసభ్యకర మెసేజ్‌లు

● దేహశుద్ధి చేసిన కుటుంబసభ్యులు ● ఆలస్యంగా వెలుగులోకి సంఘటన

అన్నవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకుడి వ్యవహార శైలి కారణంగా విద్యార్థిని కుటుంబసభ్యులు దేహశుద్ధి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యదేవ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకుడు డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థినిని నెలరోజులుగా వేధిస్తూ ఆమె ఫోన్‌కు అసభ్యకర మెసేజ్‌లు పంపడం, మానసికంగా వేధించడం, చెప్పినట్టు వినకపోతే పరీక్షల్లో తక్కువ మార్కులు వేస్తానని వేధించాడు. విద్యార్థిని కుటుంబసభ్యులకు చెప్పలేక మిన్నకుండిపోయింది. శనివారం కుటుంబసభ్యులు విద్యార్థిని ఫోన్‌లో మెసేజ్‌లు చూసి నిలదీయడంతో అసలు విషయం చెప్పింది. దీంతో కుటుంబసభ్యులు డిగ్రీ కళాశాలకు చేరుకుని అధ్యాపకుడికి దేహశుద్ధి చేయడంతో కళాశాల గోడ దూకి పరారయ్యాడు. ఈ విషయంపై పోలీసు కేసు పెడతామని కళాశాల ప్రిన్స్‌పాల్‌కు కుటుంబసభ్యులు తెలపడంతో అతడిపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు వెనుతిరిగారు.

గిరిజన విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

రంపచోడవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని దివ్యతేజ మృతదేహానికి ఆదివాసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. విద్యార్థిని మృతిపై ఇప్పటికే అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టంకు ముందు రక్త బంధువులు, పంచాయితీదార్ల సమక్షంలో శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శనివారం ఆదివాసీ నాయకులు, బంధువులు ఆందోళనతో మృతురాలి కుటుంబానికి న్యాయం చేసేందుకు ఐటీడీఏ ముందుకురావడంతో ఆందోళన విరమించిన సంగతి తెలిసిందే. దీంతో ఆదివారం శవపంచ నామా, పోస్టుమార్టం కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకాలూ కలగలేదు. రంపచోడవరం డీఎస్పీ ప్రశాంతకుమార్ శనివారం ఆదివాసీ నాయకులు, బంధువులను సముదా యించి సమస్యను శాంతియుతంగా పరిష్కరిం పచేయడంలో కీలక పాత్ర పోషించి మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రయత్నించారు.

విఘ్నేశుడికి వీడ్కోలు..



– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా విశేష పూజలందుకున్న గణపతి విగ్రహాలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో ఇలా నిమజ్జనం గావించారు.

ఐదు నెలలకే గోతులు..పగుళ్లు

కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారి అది. తమ కష్టాలు తీరాయని ప్రజలు ఆనందించేలోపుగానే రోడ్డుపై ఎక్కడికక్కడ పగుళ్లు, గోతులు. పలుచోట్ల పైకి లెగిసిపోయి నాణ్యతా లోపాలను బహిర్గతం చేసింది. ప్యాచ్ వర్కులతో కప్పేసే ప్రయత్నం చేసినా దాగలేదు. రోడ్డు నిర్మాణసమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణా లోపమే ఇందుకు కారణంగా చెబుతున్నారు.

- ఎక్కడిక్కడ లెగిసిపోతున్న రోడ్డు
- గొల్లప్రోలు-తాటిపర్తి రహదారి నిర్మాణంలో నాణ్యతా లోపాలు
- కోటి రూపాయలతో నిర్మాణం
- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం




గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారి లెగిసిపోయి ఏర్పడిన గోతులు

(ఆంధ్రజ్యోతి-గొల్లప్రోలు)

గొల్లప్రోలు పట్టణం నుంచి తాటిపర్తి గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ రహదారి(పుంతరోడ్డు)ని ఐదు గ్రామాల ప్రజలు రాకపోకలు కోసం వినియోగిస్తారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు కంటే ఇది ఐదు కిలోమీటర్ల తక్కువ దూరం కావడంతో అందరూ ఇదే మార్గాన్ని ఉపయోగిస్తారు. ఇంత ప్రధానమైన రహదారి నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలివేసింది. ఫలితంగా రోడ్డు ఉన్న నాలుగు కిలోమీటర్ల పొడవునా భారీ గోతులు పడి ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో తాటిపర్తి, చినజగ్గంపేట, వన్నెపూడి, కొడవలి, పోతులూరు గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణాన్ని మానుకున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది. పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్‌కల్యాణ్ విజయం సాధించడం, డిప్యూటీ సీఎం కావడంతోపాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ఆయన వద్దే ఉండటంతో నియోజకవర్గంలో గోతులమయంగా ఉన్న రహదారులపై దృష్టిసారించారు. నియోజకవర్గంలో ప్రధానమైన 11 పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి రూ.11కోట్లు కేటాయించారు. గొల్లప్రోలు నుంచి తాటిపర్తి వరకూ నాలుగు కిలోమీటర్ల పొడవునగల రోడ్డు నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు నుంచి కోటి రూపాయిలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఈ ఏడాది మార్చిలో పనులు ప్రారంభించి బీటీ రోడ్డును నిర్మించారు.

ఒక్కొక్కటిగా నాణ్యతా లోపాలు

గొల్లప్రోలు-తాటిపర్తి రోడ్డు నిర్మాణ సమయంలోనే నాణ్యతా లోపాలు వెలుగుచూశాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పలుచోట్లరోడ్డు లెగిసిపోయింది. వీటిని కనబడకుండా ప్యాచ్‌వర్క్‌లు చేశారు. మరమ్మతులు చేసి నాణ్యతాలోపాలు కప్పిపుచ్చుదామని ఎంత ప్రయత్నించినా ఎక్కడికక్కడ పడుతున్న గోతులు, పగుళ్ల వీటిని బహిర్గతం చేశాయి. పలుచోట్ల రోడ్డు లెగిసిపోయి గోతులు పడ్డాయి. ఎక్కడిక్కడ పగుళ్లిస్తున్నాయి. నిర్మాణసమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణా లోపం తదితర కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు చెబుతున్నారు. రోడ్డు నిర్మించిన ఆనందం మిగలకుండా అప్పుడే రహదారికి గోతులు పడటంపై ఈ రోడ్డుపై ప్రయాణించే గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతినే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతాలోపాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించి వాటిని సరిచేయాలని వారు కోరుతున్నారు.



నాణ్యతా లోపాలతో నిర్మించిన గొల్లప్రోలు-తాటిపర్తి రోడ్డు పరిస్థితి ఇది

రేపు నాయకర్ కాకినాడ జిల్లా నామకరణ సాధన పాదయాత్ర

- సాధన సమితి జిల్లా నాయకుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సాధన సమితి జిల్లా నాయకులు

కాకినాడసిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను దానం చేసిన మల్లాడి సత్యలింగం నాయకర్ పేరు కాకినాడజిల్లాకు నామకరణం చేయాలని, ఆ దిశగా సెప్టెంబర్ 2న నగరంలో తలపెట్టిన మల్లాడి సత్యలింగం నాయకర్ కాకినాడజిల్లా నామకరణ సాధన పాదయాత్రకు పెద్దసంఖ్యలో తరలిరావాలని సాధన సమితి జిల్లా నాయకులు పంపన రామకృష్ణ, దుగ్గన బాబ్జి, గుత్తుల రమణ; యెనిమిరెడ్డి మాలకొండయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎంఎస్ఎన్ చారిటీస్ ప్రాంగణంలో సమితి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాయకర్ తన యావదాస్తిని 1500 ఎకరాలు విద్యాలయాలు, కళాశాలలు, వేద పాఠశాలలు, దేవాలయాలు, నిత్యాన్నదానం కోసం దానం చేసిన మహనీయుడన్నారు. ఇప్పటికీ కాకినాడ మట్టిని ముట్టుకుంటే ఎముకలేని నాయకర్ చేతిని తాకినట్లు ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 9గంటలకు ఎంఎస్ఎన్ చారిటీస్ నుంచి కలెక్టరేట్ వరకు తాళ్లరేవు, కాజులూరు, కరపమండల ప్రజల పాదయాత్ర జరుగుతుందన్నారు. జగన్నాధపురం బ్రిడ్జివద్ద ఈ పాదయాత్రలో కాకినాడ నగర, రూరల్, ఉప్పాడ, కొత్తపల్లి, పెద్దాపురం, సామర్లకోట ప్రజలు పాల్గొని విజయవతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పిఠాపురంలో పీజీఆర్ఎస్

- ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం

పిఠాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్దగల పాడా కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తున్నట్లు పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఈపీజీఆర్ఎస్‌కు పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన అన్నిశాఖల డివిజన్, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులపై అర్జీలు ఇవ్వవచ్చునని చెప్పారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి రాలేని అర్జీదారులు, ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ వినతులు, ఫిర్యాదులు నమోదు చేయవచ్చునని పీడీ చైత్రవర్షిణి తెలిపారు. ఇటువంటి వారు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌కు వెళ్లి తమ వివరాలు నమోదు చేయాలని చెప్పారు. అర్జీదారులు వినియోగించుకోవాలని సూచించారు.



సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించిన ఆదిత్య డిగ్రీ కాలేజీ విద్యార్థులు

సముద్ర తీరంలో పరిశుభ్రత కార్యక్రమం

సర్పవరంజంక్షన్, ఆగస్టు 31(ఆంధ్ర జ్యోతి): కాకినాడరూరల్ సూర్యారావుపేట సముద్రతీరంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆదివారం కాకినాడ ఆదిత్య డిగ్రీ, పీజీ కాలేజీ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ ఎస్) అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో భాగంగా సముద్రతీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమదాన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సందర్శకులకు ఆహ్లాదాన్నందించే సముద్ర తీరప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ బీచ్‌లో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు బాటిల్స్‌లను సేకరించి మూటలు కట్టి పంచాయతీకి చెందిన రిక్షాలో డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో 80మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు ప్రైవేటు పాఠశాలల సేవలు

- ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పాఠశాలల కరస్పాండెంట్‌లు

కాకినాడ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు ప్రైవేటు పాఠశాలలు ఎంతో సేవలు అందిస్తున్నాయని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రైవేట్ పాఠశాలల ఆత్మీయ సమావేశం యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ దాసరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శేషారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల పనితీరువల్ల విద్యార్థులు జాతీయ అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందుతున్నారన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఈఎస్ఐ సంస్థ రాష్ట్ర అధికారి సురేంద్ర కుమార్ మా ట్లాడుతూ ఈఎస్ఐ సభ్యత్వం తీసుకోవడంవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ మా ట్లాడుతూ ప్రతి కరస్పాండెంట్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవస్థలో కరస్పాండెంట్లను అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, కరస్పాండెంట్లు గౌరవాన్ని కాపాడు కునేలా వ్యవహరించాలన్నారు. తమ హక్కులను తెలుసుకోవాలని, తద్వారా ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకుంటూ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రావిడెంట్ ఫండ్ కన్సల్‌టెంట్ బాబ్జి మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్ చెల్లించడంవల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు నారాయణ, వీరవెంకట గంగప్రకాష్, సామా ఈశ్వరరావు, కనకరాజు, సురేష్, సుమారు 500 మంది కర స్పాండెంట్లు పాల్గొన్నారు.

పూడుకుపోయిన డ్రైనేజీలు

- రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు
- పట్టించుకోని యంత్రాంగం

కొత్తపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం నాగులాపల్లి మెయిన్‌రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. ఇక్కడ డ్రైనేజీలు పూడుకుపోవడంతో ఇళ్లల్లో నుంచి వచ్చే నీరుతో డ్రైనేజ్ నీరు రోడ్డుపైకి చేరుతుంది. రోడ్డుకు ఒకపక్క స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచికి వివిధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని గ్రామస్థులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

గురువు మార్గదర్శకంతో ఉత్తమ ఫలితాలు

- మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ



అనఘా దత్తాత్రేయస్వామికి పూజలు చేస్తున్న మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ

పిఠాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గురువు మార్గదర్శకంతో అన్ని విషయాల్లో మానవులకు ఉత్తమ ఫలితాలు లభిస్తాయని, గురువు ద్వారానే భగవంతుడిని చేరుకోవడం సాధ్యమవుతుందని మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ తెలిపారు. పిఠాపురం పట్టణం అగ్రహారంలో ఉన్న శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్తక్షేత్రంలో ఆదివారం శ్రీచక్ర పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామిజీ దివ్య నామ సంకీర్తన జరిగింది. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. మానవుడికి ప్రతి విషయంలో ఆతృత, తొందర ఎక్కువ అని దీనివలన నష్టమే కలుగుతుందన్నారు. ఏ పనైనా ఆలోచించి క్రమపద్ధతిలో చేయాలని, అప్పుడే అది సాధ్యమవుతుందని తెలిపారు. పురాణంలో కథను ఉదహరిస్తూ పలు అంశాలను విశదీకరించారు. గురుతత్వం, గురువుని ఎలా కొలుచుకోవాలి తదితర అంశాలు గురించి వివరించారు. ఇదే క్షేత్రంలో చాతుర్మాస దీక్షలో ఉన్న దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామిజీ మాట్లాడారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయకమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పింఛన్లు తొలగిస్తున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం

- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పింఛన్లు తొలగిస్తున్నారంటూ వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులైన ఏ ఒక్కరి పింఛన్ తొలగించలేదని స్పష్టం చేశారు. గతంలో వైసీపీ కార్యకర్తలు దొంగపత్రాలతో వికలాంగ పింఛన్లు తీసుకున్నారని, అటువంటి వాటినే తనిఖీచేసి తొలగించేందుకు నోటీసులు ఇచ్చి నట్లు తెలిపారు. శవరాజకీయాలు చేసే వైసీపీకి తప్పుడు ప్రచారాలు చేయడం అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. సోమవారం జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మహిళల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని తెలిపారు. సమావేశంలో టీడీపీ పట్టణ, మండలశాఖల అధ్యక్షులు బొజ్జా సతీష్, సకుమళ్ల గంగాధర్, పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గాది రాజబాబు, నాయకులు కొరుప్రోలు శ్రీను, పిల్లి చిన్న, సూరవరపు సుబ్బారావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో టీడీపీ కార్యకర్తలు

సామర్లకోట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రభుత్వం పింఛన్‌దారులకు పంపిణీ చేయనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ సిబ్బందితోపాటు టీడీపీ బూత్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జీలు, కో-ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు తప్పని సరిగా పాల్గొనాలని తెలుగుదేశంపార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు అందాయి. ఈమేరకు పెద్దాపురం నియోజకవర్గానికి అందిన సమాచారం మేరకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పార్టీ నాయకులను ఆది వారం అప్రమత్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు సమగ్రంగా వివరించాలని సూచించారు.

ఆకట్టుకున్న పురాతన నాణేల ప్రదర్శన



పురాతన నాణేలను తిలకిస్తున్న సందర్శకులు

సర్పవరంజంక్షన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పురాతన సంస్కృతి, దేశాల ఆర్థిక, ఆధ్యాత్మిక, పురాతన నాణేలు, నోట్లను భావితరాలకు చాటి చెప్పేందుకు పురాతన నాణేల ప్రదర్శన దోహదం చేస్తుందని గిడ్డంగుల సంస్థ మాజీ జనరల్ మేనేజర్ ప్రసాద్‌నాయుడు, అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బోట్‌క్లబ్ పార్కులో వాకర్స్ సంఘం, వడ్డిపర్తి రాజేశ్వరరావుల సహకారంతో రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటుచే సిన పురాతన నాణేల ప్రదర్శన ఆకట్టుకుంది. దేశంలో 18, 19వ శతాబ్ధంలో చెలామణిలో ఉన్న వెండి నాణేలు, దమ్మిడీలు, చిల్లు కానుకలు, రాగి నాణేలు, అర్ధన, అణా, బేడ, పావలా నాణేలు ఇలా 72దేశాలకు చెందిన కరెన్సీ నాణే లు సేకరించినట్లు నాణేల సేకరణ కర్త రాజేశ్వరి తెలిపారు. పురాతన నాణేలు, కరెన్సీ మన ప్రాచీన వారసత్వ సంపదగా నిలుస్తాయని ప్రసాద్ నాయు డు తెలిపారు. ఈ సందర్భంగా నాణేల సేకరణ కర్తలు వడ్డిపర్తి రాజేశ్వరరావు, రాజేశ్వరిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, పసుమర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంటరాక్ట్ క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేసిన ఇంటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గం సభ్యులు

కాకినాడసిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో స్పాన్సర్ చేసిన విద్యాంజలి ఇంటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఉత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. క్లబ్ అధ్యక్షురాలిగా పి.ఐశ్వర్య, కార్యదర్శిగా ఒమేరా మెహరీన్, ఉపాధ్యక్షురాలిగా పి.మహాలక్ష్మి, కోశాధికారిగా పి.కాటూన్, క్లబ్ అడ్వయిజర్‌గా కె.శివాజీ, పోలియో చైర్మన్‌గా లోకేష్‌సాయి ఫణీంద్ర, ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా కెవివేక్, ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.ఆదిత్య, యూత్ సర్వీస్ డైరెక్టర్‌గా ఎన్.మాన్విదేవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ ఉపాధ్యక్షుడు మాజేటి పవన్ మాట్లాడుతూ పాఠశాలస్థాయి నుంచి సేవా కార్యక్రమాల నిర్వహణలో విద్యార్థులను భాగస్వాములను చేయాలనే ఆశయంతో రోటరీ అంతర్జాతీయ సంస్థ ఇంటరాక్ట్‌క్లబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సాన, విద్యాంజలి పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య, నేతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పిఠాపురంలో ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎరుకుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

పిఠాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ కాకినాడ జిల్లా ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పిఠాపురంలో ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలోని ఏకలవ్య విగ్రహం సంఘం ఆధ్వర్యంలో క్రిమినల్ ట్రైబల్‌యాక్టు విమోచనా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఏకలవ్యుడికి నివాళులర్పించిన అనంతరం నాయకులు మాట్లాడుతూ ట్రైబల్స్ అనుభవిస్తున్న వివిధ సమస్యలపై పోరాటం సాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడజిల్లా ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగడాల వెంకటరమణ, భారతి మాచరయ్య, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గాడ దుర్గ, జిల్లా కోశాధికారి అమలదాసు వెంకట లచ్చన్న, ముఖ్య సలహాదారు సింగం రవి, గౌరవ అధ్యక్షుడు భారతి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



బయోమెట్రిక్ ద్వారా భక్తుల హాజరు తీసుకుంటున్న దృశ్యం

మరిడమ్మ దేవస్థానంలో బయోమెట్రిక్ ప్రారంభం

పెద్దాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):స్థానిక మరిడమ్మ దేవస్థానం అన్నదాన కార్యక్రమానికి బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ఆదివారం నుంచి ప్రారంభించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ కురం విజయలక్ష్మి తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రతి ఆదివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏసీ తెలిపారు.

వైభవంగా భువనేశ్వరి అమ్మవారి జయంతి



భువనేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

పెద్దా పురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వర్తుల వారి వీధిలో ఉన్న భువనేశ్వరిపేటలో భువనేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు.

చేబ్రోలు రథంబాటలో వినాయకుడికి ప్రత్యేక పూజలు



తమలపాకులతో అలంకారం

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 31(ఆం ధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు రథంబాటలో నిలిపిన గణనాధుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చేతిలో విల్లంబు(బాణం)తో ఉన్న వినాయకుడి విగ్రహం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తాటిపర్తిలోని అపర్ణాదేవి ముఖద్వారం వద్ద నిలిపిన యువగణపతికి తమలపాకులతో ప్రత్యేక అలంకారం చేశారు.

ప్రత్యేక అలంకరణలో గణనాథుడు



సామర్లకోట, ఆగస్టు31 (ఆంధ్రజ్యో తి): సామర్లకోట కుమార రామ భీమే శ్వరాలయంలో భీమే శ్వరుడి చెంతన ఉన్న గణపతికి నవరాత్రి ఉత్సవాలు తొమ్మిదిరో జులు వైభవం గా నిర్వహిస్తున్నారు. ఒక పక్క గణపతి హోమ పూజలను నిర్వహిస్తూనే రోజుకొక అలంకారాన్ని గణపతికి పండితులు నిర్వహిస్తుండడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ ఆలయానికి చేరుకుని గణపతిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. ఆదివారం గణపతిని సుమారు 30కిలోల వెండి ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు.

వైభవంగా రాధాష్టమి ఉత్సవాలు

కాకినాడసిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణాష్టమి తర్వాత 15 రోజులకు వచ్చే శ్రీరాధాష్టమి ఉత్సవాలను ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లోని వింజమూరి వెంకట సుబ్బారావు గృహంలో వైభవంగా నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ కాకినాడశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలలో భక్తులు శ్రీరాధాదేవికి రకరకాల పూలమాలలు సమర్పించారు. అనంతరం రాధా అష్టోత్తరపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ సభ్యుడు వైకుంటేశ్వర దాస మాట్లాడుతూ శ్రీ రాధాదేవి ఆరాధన ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సామర్లకోటలో అన్నసమారాధన

సామర్లకోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):వినాయక చవితి ఉత్సవాలు ముగింపు పురష్కరించుకుని ఆదివారం సామర్లకోట పట్టణంలోనూ, మండలంలోనూ పలు గణపతి ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక నిమ్మతోట మదర్‌థెరిస్సా పార్క్ వద్ద, సంపెంగతోట కూడలి గణపతి ఉత్సవ మండపంవద్ద నిర్వాహకులు ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు శ్రీనివాసులు స్వయంగా వడ్డించి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పేపకాయల వంశీ, సేపేని సురేష్, కూనంశెట్టి అర్జునరావు తదితరులు వివిధ సేవందించారు. ఈ అన్నదానాలలో సుమారు 8వేల మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు.

పిఠాపురంలో పోలీసుల సైకిళ్ల ర్యాలీ

పిఠాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం స్ఫూర్తితో పిఠాపురం పట్టణంలో పోలీసులు ఆదివారం సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్‌లోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాదగయ సెంటర్‌లోని పోలీసు అవుట్‌పోస్టు నుంచి ర్యాలీగా బయలుదేరి ఉప్పాడ సెంటర్, కోటగుమ్మం, చర్చిసెంటర్ మీదుగా సాగింది. ర్యాలీతోపాటు పలు ముఖ్య కూడళ్లల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. ర్యాలీలో పిఠాపురం టౌన్, రూరల్, గొల్లప్రోలు, కొత్తపల్లి ఎస్ఐలు మణికుమార్, జానీ భాషా, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో సైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐలు, పోలీసులు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

టీడీపీ కార్యకర్తకు ఆటో అందజేత

గండేపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): యల్లమిల్లికి చెందిన టీడీపీ కార్యకర్త పాక నాగారాజు గత ఎన్నికల ప్రచారంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆటో అందిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఆదివారం యల్లమిల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు సుంకవిల్లి వీరవెంకటసత్యనారాయణ(సీఎం) ఆధ్వర్యంలో నాగరాజుకు ఆటో అందజేశారు. కార్యక్రమంలో మాదిరెడ్డి కృష్ణ, దేవిశెట్టి బాబ్జి, మద్దిపూడి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

నాగబాబు జన్మదిన వేడుకలు



నాగబాబుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే

జగ్గంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఇర్రిపాక గ్రామ టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నాగబాబు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. నాగబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే నెహ్రూ, జ్యోతుల నవీన్ సమక్షంలో పుట్టిన రోజు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, దేవరపల్లి మూర్తి, బూసాలపట్నం ప్రసాద్, మండపాక అప్పన్న దొర, బస్వా చినబాబు, గంటా రమణ, బద్ది సురేష్, బోళ్ల సతీష్, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం

•రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

జిల్లా సాధనకోసం ఆదివాసీల డిమాండ్

● రంపచోడవరంలో ర్యాలీ, సభ నిర్వహించిన నాయకులు



ప్రత్యేక జిల్లా సాధన కోసం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రంపచోడవరం, ఆగస్టు31 (ఆన్‌లైన్): ప్రభుత్వం త్వరలో చేపట్టబో యే జిల్లాల పునర్విభజన ప్రక్రియలో రంపచో డవరం జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పలు ఆదివాసీ సంఘాలు రంపచోడవరంలో ఆదివారం భారీ ర్యాలీని, సభను నిర్వహించాయి. ప్రస్తుతం ఉన్న అల్లూరిజిల్లాను ప్రభుత్వం అనాలో చితంగా ఏర్పాటుచేసి రంపచోడవరం, చింతూరు డివిజన్ ప్రజానీకానికి ఇబ్బందులను తెచ్చిపెట్టిందని, ఫలితంగా జిల్లా కేంద్రం కంటే రాష్ట్ర ప్రధాన కేంద్రమే చేరువగా మారిందని నాయకులు ఎద్దేవా చేశారు. ఇక్కడి ప్రజల అసౌకర్యాన్ని గుర్తించి, ప్రభుత్వం తాను చేయబోయే జిల్లాల పునర్విభజన చర్యల్లో ఈ ఇబ్బందిని తొలగించాలని, ఇందులో భాగంగా రంపచోడవరం, చింతూరు డివిజన్లను రాజమండ్రిలో కలిపే ఆలోచన చేయడం విరమించి కొత్తగా రంపచోడవరం జిల్లాను ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. తొలుత రంపచోడవరం పుర వీధులలో నాయకులు రంపచోడవరం జిల్లా సాధన పేరు తో ర్యాలీని నిర్వహించారు. అనంతరం నిర్వ హించిన సభలో వక్తలు ఇక్కడి ప్రజలకు ఉన్న పలురకాల ఇబ్బందులను చర్చించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ వీరేశం, వెదుళ్ల లచ్చిరెడ్డి, మట్ల వాణి శ్రీ, సిరిమల్లి రెడ్డి, దూడ ప్రణీత్, లోతా రామారావు, కిరణ్, బాలు అక్షయ, గొర్లె నారాయణ, చుక్కా సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుండగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో కూడా రంపచోడవరం జిల్లా సాధన కోసం సిరి మల్లి రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.

గిరిజన విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

● ఎ.ఐ.కె.ఎం.ఎస్., పీడీఎస్‌యూ నేతల డిమాండ్

రంపచోడవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని మారేడుమిల్లి గిరిజన సంక్షేమపాఠశాల విద్యార్థిని దివ్యతేజ మృతిపై ఉన్నతస్థాయి న్యాయవిచారణ జరిపించాలని అఖిలభారత రైతుకూలీ సం ఘం (ఏఐకెఎంఎస్), ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నాయ కులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు రంపచోడవరంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. గిరిజన విద్యాలయాల్లో కనీస మౌలిక సదుపాయాలు లోపించడం, సకాలంలో వైద్య సేవలు అందించే పరిస్థితులు లేకపోవడం వంటి సమస్యలు గిరిజన విద్యార్థులపాలిట శాపంగా మారిందని వారు పేర్కొన్నారు. దొరావ ఆయా విద్యాలయాల్లో గిరిజన విద్యార్థిని విద్యార్థులు మృత్యువాత పడుతున్నా అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఐటీడీఏ చర్యలు తీసుకోవడంలేదని నాయకులు చెదల మాధవరెడ్డి, ఐవీరమాల, సాదల చిలక మ్మ, అనసూయ, కంగల బాలుదొర, కెమూర్తిరెడ్డి, పల్లాల సుగ్గిరెడ్డి, పి.ఎరుకారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ విద్యార్థిని మృతిపై గిరిజన మంత్రికి, గిరిజనసంక్షేమ కమీషనర్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

నిండు గోదావరి

● భయం గుప్పిట్లో వరద బాధితులు



గోదావరి వరదనీటితో కూనవరం ప్రమాదంగా ఉన్నవారితో చేసిన పరమక్కు దృశ్యం

కూనవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలను వరద భయం వెంటాడుతూనే ఉంది. రెండు రోజులుగా గ్రామాల చుట్టూ వరద పోటె ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి 8గంటలకు 46 అడుగుల వద్ద గోదావరి ప్రవహిస్తోంది. ఇప్పటికే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా మరికొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపో యింది. సుమారు 30 గ్రామాలకు పైగా జల దిగ్బంధంలో ఉన్నాయి. రెండు రోజులుగా కూనవరం-భద్రాచలంకు రాకపోకలు నిలిచిపోయాయి.

వాగు కష్టాలు



కొండవాగు వద్ద బైక్‌ మోస్తున్న గిరిజనులు

దేవీపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో పాములగండి పోశమ్మ గ్రామాల మధ్య కొండ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగును దాటేందుకు ఆ గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్న తమ సమస్య పరిష్కారం కావట్లేదని ఎన్నిదఫాలుగా అధికారుల, ప్రజాప్రతినిధులవద్ద వెళ్లి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరినప్పటికీ వారు స్పందించడలేదని ఆరోపిస్తున్నారు. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే గ్రామాల్లోకి 108, ఆటోలు వాహనాలు వెళ్లడానికి వాగు అడ్డుగా ఉండడంతో వచ్చే పరిస్థితి లేకుండాపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చింతూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చింతూరు మండల టీడీపీ నాయకులు ఆదివారం ముంపు బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు జవహర్‌లాల్ సూచనల మేరకు సోకిలేరు వాగు మీదుగా నాటు పడవపై మండల కత్యం నిత్యావసర వస్తువులు ఏజీ కోడేరు ఒడ్డుగుంపుకు తరలించుకొన్నారు. తదుపరి అక్కడి బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. నాయకులు ఎండీఖాజాగిర్, మంగదేవ్, జానీ, రియాజ్, సాల్మన్ రాజు, వెంకటేశ్వర్‌రావు, బాబూరావు, జబ్బార్, జాపర్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు



వర ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరు ఏపీ జెన్కోలో సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా జీవెంకట శ్రీరామచంద్ర వరప్రసాద్ చేసిన సేవలు అందరి గుర్తింపు తెచ్చుకున్నారని సీలేరు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ చీఫ్ ఇంజినీర్ చెన్నకామేశ్వరరావు అన్నారు. పదవీ విరమణ పొందిన వెంకట్ శ్రీరామచంద్ర వరప్రసాద్ చీఫ్ ఇంజినీర్ సీలేరు సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం రాత్రి సత్కరించారు. డిప్యూటీ‌చీఫ్ స్టేషన్ ఛీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు, సీలేరు ఏపీ జెన్కో ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ సివిల్ సెక్షన్ ఏడీఈలు కొండబాబు, నరసింహులు ఏఈలు పవన్ విజయ కుమార్, మురళీకృష్ణ, రత్నాకర్‌మూర్తి, కాంట్రాక్టర్ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

వై.రామవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం దాలిపాడులో నిమజ్జన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని పలు గ్రామాల్లో ఊరేగించి విగ్రహాన్ని దేవరమడుగుల కాలువలో నిమజ్జనం చేశారు.

దేవీపట్నం(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందుకూరు, ఇందుకూరుపేట, శరభవరం దేవారం, ముంబూరు ఆర్ అండ్ ఆర్ కాలనీలో గణనాథుడికి ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం భారీ ఊరేగింపుతోగణ నాథుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు

జగ్గంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో గత ఐదు రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథులను ఆదివారం ట్రాక్టర్లపై తీసుకొని వచ్చి స్థానిక పుష్కర కాలువ, పోలవరం కాలువలో నిమజ్జనం చేశారు. సీఐ వైకే శ్రీనివాసరావు, ఎస్ఐ రఘునందన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ వైకే దగ్గరుండి చిన్నారితో నిమజ్జనం చేయించే ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.



జగ్గంపేటలో వినాయక నిమజ్జనంలో పాల్గొన్న చిన్నారి

గండేపల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం వినాయకుడిని నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు గ్రామాల్లో బాణ సంచా, డీన్నారు డప్పుల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్తిపాడు: మండలంలో ఆదివారం గణేష్ నిమజ్జన వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి తదితర గ్రామాల్లోని పలు గణేష్ మండపాల్లోని విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి అనంతరం పుష్కర, పోలవరం కాలువలతో పాటు చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలో ఎంతో వైభవంగా వినాయక ఉత్సవాలు గ్రామాల్లో జోరుగా కొనసాగుతున్నాయి. బొజ్జ గణపతి పూజలు అందుకుంటున్నారు. దీనిలో భాగంగా కిర్లంపూడి కుమ్మరివీధిలో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వ ర్యంలో వినాయక మండపం వద్ద రమణయ్యపేట వారిచే శ్రీరామ వర మూకాంబికా భజన మండలి వారు కోలాటం నిర్వహించారు. ఇవి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.



గండేపల్లి: మల్లేపల్లిలో గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మెగా మెడికల్ క్యాంప్, నూతన లైబ్రరీ ప్రారంభం



లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం భూపతిపాలెం రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం మెగా మెడికల్ క్యాంపుతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులందరికీ కంటి చూపు, చర్మవ్యాధులు, దంత సమస్యలపై మెడికల్ క్యాంపు పెట్టి పరీక్షలు చేశారు. అనంతరం లక్ష రూపాయలతో లైబ్రరీకి పుస్తకాలు అందించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మెడికల్ క్యాంపులో పాల్గొన్న డాక్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, మండల టీడీపీ అధ్యక్షులు పిల్లా చంటిబాబు, పోతుల మోహనరావు, భూపతిపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గల్లా రాము, సర్పంచులు యుదుల అర్జున్ రావు, కమ్మెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మరిసే అరుణ అప్పారావు, బదిరెడ్డి అప్పన్న దొర, దనాల సీతారామకృష్ణ, ఎస్ బాబు, పోసిన ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ రాజేష్, మెడికల్ క్యాంపు డాక్టర్ కాటన్, డాక్టర్ అద్దాల సత్యనారాయణ, డాక్టర్ వీవీ మూర్తినిర్వహించారు. అలుమ్ని అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు రత్నకుమార్, వర్మ వీవీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ పరమహంస, జయచంద్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీహరి, పీఎస్ నాగేశ్వరరావు, ప్రసాదబాబు గోపాల్, ఈసీ మెంబర్ పట్టాభి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల సైకిల్ ర్యాలీ



హైస్కూల్ గ్రౌండ్‌లో ర్యాలీ చేస్తున్న దృశ్యం

జగ్గంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం స్ఫూర్తితో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు సైకిల్ ర్యాలీలో భాగంగా జగ్గంపేట ఎస్ఐ రఘునందన్ రావు తమ సిబ్బందితో కలిసి జగ్గంపేట పోలీస్‌స్టేషన్ నుంచి హైస్కూల్ గ్రౌండ్‌లో సైకిళ్లతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిరోజు సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి : ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఆదివారం గండేపల్లిలో ఎస్ఐ యువీ శివనాగబాబు తన సిబ్బందితో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నిత్యం సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని అవగాహన కల్పించారు.

కిర్లంపూడి: ఆదివారం కిర్లంపూడిలో జగ్గంపేట సీఐ వైకే శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ తన సిబ్బందితో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలు సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం బాగుంటుందన్నారు. పోలీసుల ర్యాలీ ప్రత్యేకాకర్షణగా నిలిచింది.

మామిడాడ - ఏలేశ్వరం రోడ్డుకు శంకుస్థాపన



మామిడాడలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాడలో బీటీ రోడ్డుకుఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదివారం శంకుస్థాపన చేశారు. మామిడాడ నుంచి ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెం వరకు మూడు కిలోమీటర్లు మేర రూ.120 కోట్లతో ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మామిడాడ చుట్టుపక్కల ఐదు గ్రామాల ప్రజలు ఏలేశ్వరం వెళ్లేందుకు ఈ రహదారి సులభంగా ఉంటుంద న్నారు. అలాగే అప్పనపాలెం వద్ద గత వరదల్లో బ్రిడ్జి కూలిపోవడం జరిగిందని, రాబోయే రోజుల్లో రూ.10 కోట్లతో నిర్మిస్తామన్నారు. అంత వరకు ఇర్రిపాక వద్ద ఏలేరు నదిపై తాత్కాలిక వంతెన నిర్మాణం జరిగిందని, ప్రజలు దాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. అలాగే రామవరం, రాజుపాలెం రోడ్డుకు రూ.14 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులు కాంట్రాక్టర్ తీసుకుని పని చేయటం లేదని, తాత్కాలిక మరమ్మత్తులకు రూ.28 లక్షలు విడుదల చేయడం జరిగిందన్నారు. వారం రోజుల్లో పనులు పూర్తిగా మొదలు పెట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, మండల పార్టీ ప్రెసిడెంట్ జీను మణిబాబు, పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ డీఈ గంగాధర్, ఆడపా తాతాజీ, పాలచర్లగంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వెంకట్ కుటుంబానికి రమేష్ పరామర్శ



వెంకట్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జనసేన నేత రమేష్

జగ్గంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బలభద్రపురం గ్రామానికి చెందిన పెంటకోట వెంకట్ ఇటీవల మృతిచెందారన్న వార్త తెలుసుకున్న జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో మండపాక పాపన్నదొర, సూరిబాబు, దొర, మాదారపు వీరబాబు, కాయల మణికంఠ, రేఖాని శ్రీను పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన న్యాయవాదులు

ప్రత్తిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి ముద్రగడ పద్మనాభంను ఆదివారం ప్రత్తిపాడు పూర్వ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చలంకూరి రామకృష్ణ, నాయుడి లింగంపల్లి శివకుమార్, ప్రత్తిపాడు గ్రామ పెద్ద చలంకూరి రాజుబాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనారోగ్యంతో గుర్రై ఆసుపత్రి నుంచి వచ్చిన ఆయన్ని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 22న దివంగత వైఎస్సార్ వర్ధంతిని గ్రామంలో నిర్వహించే విధంగా ప్రణాళికలు చేపట్టాలని కోరారు.

రహదారిపై నిలిచిన నీరు

ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు



కత్తిపూడి జాతీయ రహదారి కూడలిపై మురికినీరు

శంఖవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అంటే అద్దంలా మెరిసే రోడ్డు. ముక్కులతో సుందరంగా అలంకరించిన కూడళ్లే కనపడతాయి. కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై మాత్రం ఇందుకు విరుద్ధంగా రోడ్డుపై ప్రవహించే మురికినీరు... ప్రయాణీకులకు ఇబ్బందులు మాత్రమే కనపడుతున్నాయి. కత్తిపూడి 16 నెంబరు జాతీయ రహదారి కూడళ్లలో ఉన్న డ్రైన్ల నిండిపోయి రోడ్డపై నవలా ప్రవహిస్తున్నాయి. ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేయడానికి హైవే, పంచాయతీ అధికారులు వంతులు వేసుకుంటున్నారు. సమస్య మాత్రం వ్యాపారులు, ప్రజలు, ప్రయాణికులను వేధిస్తోంది. ఈ మురికి వల్ల బైక్లపై వెళ్లే వాహనదారులు జారి పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆటో కార్మికులకు సాయం

కిర్లంపూడి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగపతినగరం గోరింకలపు ఆలయం వద్ద జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఆటో కార్మికులకు బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయిందని ఆటో కార్మికులను ఆదుకునేందుకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మంచి ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో తూము కుమార్, సొసైటీ ప్రెసిడెంట్ కర్ర చినబాబు, ఆళ్ల శ్రీమన్నారాయణ, కాళ్ల వెంకటేష్, గుడాల రాంబాబు, మద్దాల మణికంఠస్వామి, ఆదారి నానాజీ, మదిరెడ్డి సూరిబాబు, దిడ్డి చిట్టిబాబు, పెంకుటేటి శివ ఉన్నారు.

దుర్గమ్మ ఆలయానికి తగ్గిన భక్తుల తాకిడి

గండేపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మురారి గ్రామ శివారున కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయం ఆదివారం, గురువారం వచ్చిందంటే భక్తులతో కిటకిటలాడుతుండేది. అయితే ఈ వారం వినాయక చవితి ఉండడంతో భక్తుల తాకిడి తగ్గింది. దీంతో ఆలయ ప్రాంగణమంతా ఖాళీగా కనిపించింది. కొంతమంది భక్తులు మాత్రమే వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం

ప్రత్తిపాడు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ధర్మవరం గ్రామానికి చెందిన కేదారి లోకేష్‌ను ఆదివారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు ప్రైవేట్ మదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో లోకేష్ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.కృష్ణంరాజు ఆసుపత్రికి వెళ్లి ఆర్థిక సహాయం అందించారు.ఆయన వెంట నానిపల్లి వెంకన్న, నానిపల్లి చంటి, బొల్లు నాగేశ్వరరావు, కోలా తాతబాబు, జువ్వల నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రజాహితమే లక్ష్యం: ఎమ్మెల్యే దివ్య



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజాహితమే లక్ష్యంగా ప్రభుత్వం పేదలను ఆదుకోవడంలో ముందువరుసలో నిలుస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.6.84 లక్షల చెక్కుల రూపంలో ఎనిమిది మంది లబ్ధిదారులకు సీనియర్ నాయకుడు యనమల రాజేష్‌తో కలిసి ఎమ్మెల్యే దివ్య అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపత్కాలంలో ఉన్న పేదలను ఆదుకోవడమే కర్తవ్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సీ ఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటోందన్నారు. మండలంలోని శృంగవృక్షంపేట, కృష్ణాపురం, దానవాయిపేట, సీతారామపురం, పాతపెరుమాళ్లపురం, వెలమకొత్తూరు, ఎస్.అన్నవరం, ఎస్.సూరవరం గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఆయా గ్రామాల నేతల సమక్షంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

టీడీపీ బలోపేతానికి సమష్టి కృషి

టీడీపీ బలోపేతానికి సమష్టిగా కృషిచేద్దామని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తుని మండలం రాపాక గ్రామం నుంచి పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కూటమితోనే సాధ్యమన్నారు. గ్రామాల్లో ఎక్కువ శాతం ఒకే పార్టీలో ఉంటే ఆయా గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో యనమల రాజేష్, మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, మండెన గంగాధర్, గదం బాబ్జి, కాళ్ల లోవరాజు, లోకవరపు శ్రీను, శ్రీనివాసరావు, జె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా రాధాష్టమి

తొండంగి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాధాష్టమి వేడుకలు ఆదివారం పెరుమాళ్లపురం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. రాధాకృష్ణుల చిత్రపటాలను పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాధామాధవుల చరితామృతాన్ని పారాయణ చేశారు. భక్తులు రాధాకృష్ణుల నామ సంకీర్తన చేశారు. భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.

గంగమ్మ ఒడికి గణనాథులు

తాండవలో నిమజ్జనం చేసిన భక్తులు

తునిరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక మండపాల్లో పూజలు అందుకున్న గణనాథుల నిమజ్జన వేడుకలు ఆదివారం తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కన్నుల పండువగా జరిగింది. నిమజ్జనంలో ఏటువంటి అవాంఛనీయ కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా టౌన్, రూరల్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తునిలో ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న తాండవ నదీ ఘాట్ వద్ద పోలీసులు క్రేన్ ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

గడ్డిపేట పీహెచ్‌సీలో కన్సల్టేషన్ రూమ్

తొండంగి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒంటిమామిడి దివిస్ లేబొరేటరీ నూతనంగా నిర్మించిన కన్సల్టేషన్ రూమ్, వెయిటింగ్ హాలును సీనియర్ మేనేజర్ సుధాకర్ ప్రారంభించారు. అందుకు సంబంధించిన పత్రాలను ఆ సంస్థ ప్రతినిధులు వైద్యాధికారి లక్ష్మీప్రసన్నకు అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గ్రామ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. రూ.11.25 లక్షల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ని ధులతో గడ్డిపేట పీహెచ్‌సీలో కన్సల్టేషన్ రూమ్, వెయిటింగ్ హాలును నిర్మించామన్నారు. నూతనంగా నిర్మించిన భవనం ద్వారా రోజుకు 50 మంది రోగులను సౌకర్యవంతంగా పరీక్షించి వైద్య సేవలందించేందుకు వీలుంటుంది. కార్యక్రమంలో బీవాసుబాబు, కెతేజ, ఎస్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబుకు అభినందనలు

ప్రత్తిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీ బోర్డ్ సభ్యుడిగా ప్రత్తిపాడుకు చెందిన టీడీపీ కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు నియమితులయ్యారు. ఎమ్మెల్యే వ రుపుల సత్యప్రభ కృషి, సహకారంతో ఈ పదవి లభించినట్టు కన్నబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కన్నబాబును టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్తిపాడు వచ్చి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అమరాది వెంకట్రావు, యాళ్ల జగదీష్, వరుపుల రామకృష్ణ, యాళ్ల విశ్వేశ్వరరావు, ముత్యాల రాంబాబు, చెక్కపల్లి మండేశ్వరావు, రామాల అప్పలరాజు, కొమ్ముల జయబాబు, రావూరి తాతాజీ, చెక్కపల్లి నవీన్, పల్లాగోపి, కోట్టెటి అబ్బులు, గొంతిన సురేష్, చలంకూరి మనోజ్ పాల్గొన్నారు.



కన్నబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

సత్యదేవుడికి ప్రత్యేక పూజలు



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో ఆదివారం పలువురు ప్రముఖులు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామిని దర్శించిన వారిలో ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, ఆముదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్, తదితరులున్నారు. వీరికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో మనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. సత్యదేవుడికి రథోత్సవం నిర్వహించారు. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి బాజాభజంత్రీలతో తొడ్కొనివచ్చి పుష్పాలంకరణ చేసిన రథంపై ఉంచి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణలు నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం ప్రదక్షిణ చేశారు. హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం, గోసంరక్షణ ట్రస్టులకు ఒక దాత రూ.250 లక్షలు విరాళంగా సమర్పించారు. అన్నవరం దేవస్థానం మొదటి గ్రేడ్ ప్రత ఫహ హితుడిగా పనిచేస్తున్న శ్రీ సూర్యనారాయణమూర్తి తనయుడు సత్యగోప్ ఉదయ్‌శర్మ ఈ మొత్తాన్ని ఆలయ ప్రైవేట్ రోహిత్‌కు అందజేశారు. ఈమొత్తంలో రూ.లక్ష నిత్యాన్నదాన పథకానికి, రూ.150 లక్షలు గోసంరక్షణ ట్రస్టుకు అందజేసినట్టు దాత తెలిపారు. దాతను ప్రైవేట్ రోహిత్ అభినందించారు.